డిటెక్టివ్ కథ

# డమ్మీ బుల్లెట్!

కౌండిన్య

**శివలింగం మీంచి జారుతున్న అభిషేక క్షీరంలా, నునుపుగా వున్న నల్లటి కొండమీంచీ దూకుతున్నాయి, ఆవేశంగా శబ్దం చేస్తూ - నీళ్ళు ... సహజసిద్ధమైన తలకోన జల పాతం! దూకుతూ రూపొందించుకున్న కొలనులో కాస్సేపు ఆగి, ప్రవహించుకు పోతున్నాయి.. ఎక్కడికో!**

**ఆకాశం మీదికి ఎగబాకిన సూర్యుడు తలకోనలోని కొలనులోకి తొంగిచూస్తూ, తామరల్ని మేలుకొలుపుతున్నాడు; కిరణాల వేళ్ళతో వాటి బుగ్గలు నిమురుతూ...**

**విచ్చుకుని, సూర్యుణ్ని చూసి నవ్వుతున్న తామరల మధ్య ఉన్నట్టుండి ఒక సజీవ కమలం ప్రత్యక్షమైంది. అది కమలం కాదు; అందాల నటి తూలిక ముఖం...**

ఆంధ్రా కౌబాయ్ సినిమా షూటింగ్‌లో, తలకోనలో వున్న తూలిక మూడోకంటికి తెలీకుండా, తెల్లారేసరికి - తలకోన జలపాతంలో స్విమ్మింగ్ చేస్తోంది! హిందీ నటి కరీనాను అనుకరిస్తూ, బికినీ వేసుకుని, ఆ ఏకాంత ప్రదేశంలో గోల్డ్‌ఫిష్‌లా ఈదులాడుతోంది తూలిక.

తూలిక ఉల్లాసంగా నీటిమీద వెల్లకిలా తిరిగింది. తూలిక శరీరం బంగారు తీగలాగా వెనక్కి జారుతోంది. వయ్యారంగా తామర పువ్వులా మెరుస్తున్న ఆమె ముఖాన్ని జంట తామరమొగ్గలు నీటిలోంచీ, నిక్కిచూస్తూ వెంటాడుతున్నాయి... తనను ఎవ్వరూ చూడ్డం లేదన్న ధైర్యం తూలిక చేత విచ్చలవిడిగా జలవిహారం చేయిస్తోంది.

తనను ఎవ్వరూ చూడ్డం లేదన్న తూలిక నమ్మకాన్ని ఎగతాళి చేస్తూ చెట్ల చాటులోంచీ రెండు కళ్ళు రహస్యంగా చూస్తున్నాయి. ఆ కళ్ళు కెమెరామన్ 'కెమెరా కిరణ్' కళ్ళు....

కెమెరా కిరణ్ చేతుల్లోని ఇటాచీ కామ్‌కార్డర్. అలల మీద ఆరబోసిన తూలిక అందాల్ని లాగి, తనలో దాచుకుంటోంది; ముందు ముందు 'కనువిందు' చేయడానికి! వర్ధమాన నటి తూలిక వొంపుసొంపులు కెమెరా కిరణ్ శరీరాన్ని జలదరింప చేస్తున్నాయి. స్విమ్ సూట్‌లో ఇమడకుండా పొగరుగా బైటపడుతున్న తూలిక సౌందర్యం కిరణ్ రెప్పల్ని లాగి పట్టింది...

కిరణ్ పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. పని చేసే ప్రతీ సినిమాలోంచీ ఇలాంటి దృశ్యాల్ని బావ జగన్‌కి ప్రెజెంట్ చేయడం కిరణ్ అలవాటు! ఈసారి తను బహూకరించే తూలిక వీడియోతో జగన్ తూలిపడిపోవడం ఖాయం! చెల్లెలు మల్లికను పళ్ళెంలో పెట్టి తనకు ఇవ్వడం ఖాయం! తూలిక ఇంకా జలకాలాటలోనే వుంది! తడి బికినీ విప్పేసి, పొడిబట్టలు కట్టుకునే గిలిగింతల సన్నివేశం కోసం వెయ్యికళ్ళతో ఎదురు చూస్తున్న కిరణ్ - కళ్ళకు సంతర్పణ చేస్తున్న తూలిక తడి ఆరని అందాల్ని చూస్తూ సర్వాన్నీ మరిచిపోయాడు... తామరాకు మీద కూచుని, తన వైపే చూస్తున్న చిన్నారి కప్పపిల్లను చూస్తూ చిరునవ్వు నవ్వుతున్న తూలిక ముఖం నీటి బిందువులతో మెరుస్తోంది. తాను సినిమాల కోసం షూట్‌చేసే 'యాక్టింగ్ స్నానఘట్టాలు' వేరు! ఇలాంటి నేచురల్ జలక్రీడలు వేరు! అడ్డూ, ఆపూ లేని జలక్రీడలవి...

కిరణ్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. తన కుడి భుజం మీద పడిన చేతిని వాలుగా చూశాడతను. చెట్లు గుబుర్లలోంచీ దూరిన సూర్యకిరణాలతో, ఆ చేతి వేళ్ళకి వున్న ఉంగరాల రాళ్ళు తళుక్కుమన్నాయి. కిరణ్ గుండె దడదడ కొట్టుకుంది. ఆ ఉంగరాల చెయ్యి ఎవరిదో అతనికి తెలుసు!....

ఉంగరాల చెయ్యి మొరటుగా కిరణ్‌ని వెనక్కి తిప్పింది. రెప్పవేయకుండా తీక్షణంగా చూస్తున్న గాజు బిళ్ళల్లాంటి కళ్ళల్లోకి - హీరో 'ఇంద్ర' కళ్ళల్లోకి భయంతో చూశాడు కిరణ్.

"సా... ర్..." కిరణ్ పెదవులు వణుకుతూ ఏదో పలికే ప్రయత్నం చేశాయి. అయితే, ఇంద్ర నాలుగు వేళ్ళని అంటి పెట్టుకుని వున్న ఐదు ఉంగరాలు ఆ పెదవుల్ని అడ్డుకున్నాయి. హీరో ఇంద్ర చెయ్యి త్రాచు పాము పడగలా చివాల్న కదిలి, కిరణ్ బుగ్గను పగలేసింది. ఐదు వజ్రాలు చేసిన ఐదు గాయాల్లోంచీ నెత్తురు ఐదు కాలవలు కట్టింది.

"బాస్టర్డ్! ఏం చేస్తున్నావ్?" ఇంద్ర కంఠం సినిమా యాసలో మోగింది.

కిరణ్ సమాధానం కోసం ఎదురు చూడకుండా ఇంద్ర బూటుకాలు కిరణ్ పొట్టలో గునపంలా గుచ్చుకుంది. కిరణ్ వెల్లకిలా పడిపోయాడు. సాధారణంగా, ఇరవై నాల్గు గంటలూ ఇంద్ర కోటేరు ముక్కు మీద కాపురం చేస్తూ వుండే కోపం, ఆగ్రహంగా, ఒళ్ళు తెలీని కోపంగా, పూనకంగా మారిపోయి, అతని అణువణువునా వ్యాపించేసింది. చాలా సినిమాల్లో చేసిన భీకరమైన ఫైట్సన్నీ గుర్తొస్తూ అతనికి ప్రాంప్టింగ్ ఇస్తున్నాయి. ఇంద్ర చేతులూ, కాళ్ళు వంతుల ప్రకారం క్షణం ఆగకుండా కెమెరా కిరణ్ శరీరాన్ని నుగ్గు నుగ్గు చేస్తున్నాయి. కిరణ్ అరుపులు అరణ్యరోదనగా మారుతున్నాయి.

యాక్షన్‌హీరో ఇంద్ర, కిరణ్‌ని చెట్టుచాటు నుంచీ ఇవతలకి బిరబరా యీడ్చుకెళ్ళాడు; కొలను వైపు. నేల మీద వెల్లకిల్లా పడిన కిరణ్ చొక్కాను ఎడం చేత్తో పట్టుకుని పైకి లేపాడు. ఇటీవలే విడుదలైన 'ఎర్ర పిడికిలి' చిత్రంలో క్లైమాక్స్‌లో విలన్నికొట్టిన పిడికిలి దెబ్బను గుర్తు చేసుకుంటూ కుడి పిడికిలి పైకెత్తాడు; ఇంద్ర. రెండు బలమైన చేతులు వెనక నుంచీ అతన్ని చుట్టేసి, బలంగా లాగాయి. ఇంద్ర తలతిప్పి చూశాడు. స్టంట్ మాస్టర్ జగన్, కెమెరా కిరణ్ బావ జగన్-

"ఏమిటీ దారుణం హీరోగారూ! చంపేస్తారా? కూల్‌డౌన్!" జగన్ ఆగ్రహాన్ని అదుపులో పెట్టుకుంటూ అన్నాడు.

"చంపేస్తాను! బాస్టర్డ్! తూలిక స్నానం చేస్తుంటే పిక్చరైజ్ చేస్తాడా, గాడిద కొడుకు? 'ఐ విల్ కిల్ హిమ్!' ఇంద్ర అరిచాడు. "వదులు! వదల్రా!"

జగన్ చేతులు ఇనపకడ్డీల్లా ఇంద్ర చుట్టూ బిగుసుకున్నాయి. "కూల్‌డౌన్! ప్లీస్ కూల్..."

ఇంద్ర తల రపీమని జగన్ ముఖం మీద ఆనింది. జగన్ చేతులు ఇంద్రని వదిలేశాయి. రెండు పెదవులూ చిట్లిపోయి రక్తం చిమ్మాయి. జగన్ కొంచెం రక్తాన్నీ, ఊడినోట్లోకి జారిన రెండు పళ్ళనూ అరచేతిలోకి ఉమ్ముకున్నాడు. ఆంధ్రా కౌబాయ్ సినిమాకి స్టంట్ మాస్టర్‌గా చేస్తున్న జగన్ శరీరం రియాక్టైంది. కండలు పైకి పొంగుతున్నాయి. పిడికిళ్ళు బిగుసుకు

న్నాయి. జగన్ వైపు నిర్లక్ష్యంగా దూసుకెళ్ళబోయిన ఇంద్రను తూలిక కేక ఆపింది. ఇంద్ర కొలనువైపు తిరిగాడు. నడుం లోతు కళ్ళల్లో నిలుచుని వణికిపోతూ చూస్తోంది తూలిక. ఇంద్రలోని హీరో కదిలాడు. తూలిక దగ్గరగా వెళ్ళి, తన చొక్కా తీసి, ఆమె చుట్టూ కప్పాడు. చొరవగా భుజం మీద చెయ్యివేసి, గట్టు మీదకి నడిపించాడు.. తూలిక గెస్ట్‌హౌస్‌కి తీసుకెళ్ళే కాలిబాటలో పరుగు ప్రారంభించింది..

ఇంద్ర జగన్‌నీ, అతని ఆసరాతో నిలుచున్న కెమెరా కిరణ్‌నీ తీక్షణంగా చూశాడు. "తూలిక నాది! షీయీజ్ మైన్! కళ్ళెత్తి చూస్తే, కాళ్ళు తీసేస్తా! గెటౌట్!"

జగన్ నిర్భయంగా, సూటిగా ఇంద్ర కళ్ళల్లోకి చూశాడు. అతని శరీరం ఇంద్ర మీద దండయాత్ర చేయమంటోంది. ప్రొఫెషన్ 'కూల్ డౌన్!' అంటోంది... ఓకే... రాజ్యం హీరోలది... జగన్ బరువుగా నిట్టూర్చాడు. కిరణ్‌ని నడిపించుకుంటూ ముందుకు కదిలాడు. కాస్సేపట్లో ఇద్దరూ మలుపు తిరిగారు.

ఇంద్ర వెనుదిరిగి, చెట్ల గుబుర్ల వైపు నడిచాడు. కొమ్మల్నీ, రెమ్మల్నీ తొలగించుకుంటూ లోపలికెళ్ళాడు. కెమెరా కిరణ్ చేతుల్లోంచి జారిపడిన ఇటాచీ 'కామ్‌కార్డర్' ఏమీ ఎరగనట్టు, పడినచోటే వుంది. ఇంద్ర వొంగి కామ్‌కార్డర్ని అందుకున్నాడు. కెమెరా కిరణ్ ఎక్స్‌పర్ట్! కళ్ళు చెదిరేలా తూలికను షూట్‌చేసి వుంటాడు! ముందు ముందు తనకు అందాల కనువిందు...

***

"కిరణ్ గాణ్ణీ, వాడికి సపోర్టొచ్చి నన్ను కొట్టినంత పనిచేసిన జగన్ గాణ్ణి - పీకి పారేయాల్సిందే... నేను యాక్ట్ చేయాలంటే!" హీరో ఇంద్ర కరాఖండిగా అన్నాడు.

"నిర్మాత విజయసారథి విసుగ్గా చూస్తూ, పళ్ళ మధ్య ఇరికించిన పైప్‌ని ఇవతలికి లాగాడు. "మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కినట్టుందే, నీ వరస? ఇద్దర్నీ చావబాదింది నువ్వు!"

"అంటే - నా మాట నెగ్గదా? ఈ పిక్చర్లో వుంటే, వాళ్ళో నేనో వుండాలి! అంతే!" ఇంద్ర ఆవేశంగా అన్నాడు. "ఐదు నిమిషాలు టైం మిస్తున్నా, తేల్చుకోండి!"

నిర్మాత విజయసారథి ఆవేశంగా నోట్లోంచి పైపుని తీశాడు. దర్శకుడు ధరణి, చేత్తో తాకి ఆయన్ని వారించాడు.

"ఒక్కక్షణం... జనం గౌరవించేదీ హీరోని. మనం గౌరవించాల్సిందీ హీరోనే! అయితే జగన్నీ, కిరణ్‌ని తన్నితగిలేస్తే పెద్ద ప్రమాదంలో ఇరుక్కుంటాం.. ముఖ్యంగా మన హీరోగారు... ఆ ప్రమాదం... మీడియా!" ధరణి సాభిప్రాయంగా చూస్తూ ఆగాడు.

'మీడియా' అన్న పదం ఏదో అరవబోయిన హీరో ఇంద్ర నోటికి తాళం వేసింది.

"వాళ్ళు బైటికెళ్తే - ఊరుకోరు! అల్లరీ , ఆగం గ్యారెంటీ!" ధరణి తెలివిగా అన్నాడు.

"ఇంద్ర రంకెలేస్తున్నాడు గానీ, వాళ్ళే వెళ్ళిపోతామంటున్నారు! ఆ!" నిర్మాత అందుకుంటూ అన్నాడు. "ఆ తూలిక ఒకటి! అలిగి కూచొంది!".

"వస్తున్నా! వాళ్ళు వుండాలి! మన హీరోగారి గౌరవం మిగలాలి..." దర్శకుడు ధరణి అన్నాడు. "ఒక పని చేద్దాం. యూనిట్ అందరి



ముందూ ఆ ఇద్దరిచేతా హీరోగారికి క్షమాపణ చెప్పిద్దాం. కెమెరామన్ చేత హీరోయిన్‌కీ, వాళ్ళమ్మకి సారీ చెప్పిద్దాం... అలా చేస్తే - కర్రా విరగదే; పాము చావదు!"

"సరే... ఈసారికి అలాగే కానివ్వండి!" 'మీడియా ఫోబియా' వున్న హీరో ఇంద్ర గంభీ రంగా అనేసి వెళ్ళిపోయాడు.

'వెన్నలో వెంట్రుక తీసినట్టు తేల్చాశావు గదయ్యా, ధరణీ!" విజయసారధి మెచ్చుకున్నాడు.

"డైరెక్టరన్నాక ఆ మాత్రం చేయకపోతే ఎలాగా?" ధరణి సగర్వంగా అన్నాడు. "అసలు - మనం కెమెరా కిరణ్‌కి థాంక్స్ చెప్పాలి! అతను షూట్‌చేసిన తూలిక జలకాలాట బిట్‌ని ఫిల్ములో ఇంకించేద్దాం!"

"అందుకే నిన్ను బెట్టుకున్నా!" విజయసారధి ఉత్సాహంగా అన్నాడు. "ఆ స్టంటు గాణ్ణీ, కెమెరా గాణ్ణీ పిలిపించు! చెరో లక్షా పారేసి, రాజీ చేసేస్తా!"

***

"నిజం చెప్పాలంటే, ముహూర్తం కాగానే క్లైమాక్స్ షూట్ చేయడం నాకిష్టమే లేదు! అపశకునాలే, అపశకునాలు! ఎంత మొత్తుకున్నా మీరు వినకపోతిరి! ముందుగా క్లైమాక్స్ అంటూ మొండికేశారు!" ధరణి దెప్పుతూ అన్నాడు.

అర్ధరాత్రి కావస్తోంది. కెమెరామన్ గదిలో సమావేశం జరుగుతోంది. టీపాయ్ మీదున్న విస్కీబాటిల్ చుట్టూ ముగ్గురు కూచున్నారు. వొళ్ళుకుళ్ళ బొడిపించుకున్న కెమెరా కిరణ్. పళ్ళు ఊడగొట్టించుకున్న స్టంట్ జగన్. గతంలో చాలాసార్లు హీరో ఇంద్ర చేత అవమానించబడిన విలన్ సుధీర్.

"అయితే చెరో లక్షా నష్టపరిహారం కింద ముట్టిందన్న మాట!" విస్కీ తాగేసి అన్నాడు సుధీర్.



“వెళ్ళిపోతామనీ, మీడియా ముందు కక్కేస్తామనీ బెదిరించా!” జగన్ సగర్వంగా అన్నాడు. “పిక్చర్ని వదలకూడదని కాదు; వాణ్ని వదలకూడదన్న ఐడియాతో రాజీ నటించాం! సారీ చెప్పాం...”

“పెద్ద హీరో అనుకుంటున్నాడు రాస్కెల్! వాడికి గుణపాఠం చెప్తేగాని నాకు నిద్ర పట్టదు!” కెమెరా కిరణ్ పళ్ళు కొరుకుతూ అన్నాడు.

స్టంట్ జగన్ పిడికిలి తెరిచాడు. ఉదయం, రాలి పడినప్పట్నుంచీ అతని గుప్పిట్లోనే వున్న అతని రెండు పళ్ళు తళుక్కుమన్నాయి. “కంటికి కన్ను! పంటికి పన్ను! ఇది స్టంట్ మాస్టర్ జగన్ శపథం! నీ పగ నేను తీరుస్తాను కిరణ్!”

“గుడ్! నాక్కూడా ఇంద్ర గాడు నరకం చూపించాడు! పగతో రగిలి రగిలి ఛస్తున్నా! మీతో చెయ్యి కలుపుతున్నా! నన్ను ఆయుధంగా వాడుకోండి!” విలన్ సుధీర్ బుస కొట్టాడు.

మూడు గ్లాసులు ఒకదాన్నొకటి ఢీ కొట్టాయి; ఐకమత్యంగా...

***

తలకోన చంద్రమందిర్‌లోని మరో గదిలో మరో ఇద్దరు సమావేశమయ్యారు. ఆ గది హీరో ఇంద్రది. ఆ ఇద్దరూ – హీరో ఇంద్ర; హీరోయిన్ తూలిక.

“అమ్మ మీకు స్పెషల్‌గా థాంక్స్ చెప్పమంది... అందుకే వచ్చాను...” అంది తూలిక, చిరునవ్వు నవ్వుతూ.

హీరో ఇంద్ర చిరునవ్వు నవ్వాడు.

“అక్కడ... అప్పుడు... ‘తూలిక నాది’ అన్నారు... అది నిజమేనా?” తూలిక సిగ్గు పడుతూ అడిగింది.



# మీరే డిటెక్టివ్!?

*నిర్వహణ: అన్య*

## వెండి గిన్నె

వెండి పాత్రలు, ఆభరణాల షాపులో దోపిడీ జరిగింది.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ తన దగ్గరున్న దొంగల ఫొటో ఆల్బం చూపి,

"ఇందులో ఎవర్నైనా పోల్చుకోగలరా?" అంటూ షాపు యజమానిని ప్రశ్నించాడు.

"నేను వాడి మొహమే చూడలేదండి. అప్పుడు, పాత్రలకు పాలిష్ పెట్టే పనిలో వున్నాను. వీపు ద్వారం వైపుంది. ఆ వెనక నుండి ఓ గొంతు వినిపించి, "నా దగ్గిర పిస్తోలుంది. ఇటు చూశావా, కాల్చేస్తాను. ఆ వస్తువులన్నీ నాకందించు" అంటూ.

చేసేదేముంది? పాత్రలు, నగలన్నీ ఒక్కొక్కటే తీసి అందించాను. ఆ తర్వాత అతడు వెళ్లిపోయేటప్పుడు వీపు మాత్రం కనిపించింది.

"మొహం చూడలేదన్న మాట"

కాస్త తొట్రుపాటు ప్రదర్శించిన యజమాని. "మేం పాత్రల్ని బాగా పాలిష్ చేసి పెడతాం. అన్నీ తళతళా మెరుస్తుంటాయి. ఒక పెద్ద ఫ్రూట్ బౌల్ అతడికందించేటప్పుడు దాని అడుగున వాడి ప్రతిబింబం కనిపించింది. కాని అదెంతసేపని? కేవలం రెండు మూడు సెకన్లే గద. అయినా గుర్తుపట్టటానికి ప్రయత్నిస్తాను" అన్నాడు.

"ఇతడేనా?" అంటూ మరో ఫొటో చూపించాడు ఇన్‌స్పెక్టర్.

"అవును. ఇతడే" అన్నాడు ధైర్యంగా.

"నాన్సెన్స్. అసలు షాపులో దోపిడీ జరగలేదు. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం నువ్వాడుతున్న నాటకమిది" అన్నాడు డిటెక్టివ్.

అతడు అబద్ధాలు ఆడుతున్నాడని డిటెక్టివ్ ఎలా గ్రహించాడు?

---

సమాధానం : ఫ్రూట్ బౌల్ అడుగున ప్రతిబింబం చూసి గుర్తు పట్టానన్నాడు యజమాని. కాని ఆ ప్రతిబింబం తలకిందులుగా కనిపిస్తుంది. రెండు మూడు సెకన్లలో వ్యక్తిని పోల్చుకోవటం అసాధ్యం.

"యస్! యూ ఆర్ మైన్!" ఇంద్ర ఉద్రేకంతో అన్నాడు. "వాడు నిన్ను అలా షూట్ చేస్తుంటే తట్టుకోలేక పోయాను"

"థాంక్స్... కానీ..."

"నీకు తెలుసా? గోల్డ్ స్క్రీన్ పిక్చర్లో నిన్ను బుక్ చేయమని ఇందాక ప్రొడ్యూసర్‌కి ఫోన్ చేశాను..." ఇంద్ర ఆమెనే చూస్తూ అన్నాడు. "మనిద్దరి కాంబినేషన్లో కనీసం... నాలుగు సినిమాలు రావాలనుకుంటున్నాను..."

తూలిక తృప్తిగా నిట్టూర్చింది... ఇంద్ర చెయ్యి కదిలింది. లైటు ఆరిపోయింది.

***

"యాక్షన్!" డైరెక్టర్ ధరణి అరిచాడు.

చంద్రమందిర్ నేలమాళిగలో హీరోకీ, విలన్‌కి మధ్య ఫైట్...

కౌబాయ్ గెటప్‌లో వున్న హీరో ఇంద్ర చాటు నుండీ ఇవతలకి వచ్చాడు. విలన్ గెటప్‌లో వున్న సుధీర్ స్తంభం చాటునుండీ హీరో మీదికి దూకాడు. ఇద్దరి మధ్య ముష్టియుద్ధం. పది నిమిషాలు నిరాటకంగా సాగిన యుద్ధం డైరెక్టర్ 'కట్' కేకతో ఆగింది.

"టేక్ వోకే!" ధరణి ఉత్సాహంగా అన్నాడు. హీరోకీ, విలన్‌కి దగ్గరగా నిలుచుని తరువాత బిట్ గురించి వివరించాడు. అయిదు నిమిషాలు గడిచాయి.

"సైలెన్స్! లైట్సాన్! స్టార్ట్ సౌండ్!" ధరణి – అరుపు.

"యాక్షన్!"

ఇందాక హీరో చేతిలోంచీ జారిపడిన పిస్టల్ మీదికి దూకి, అందుకున్నాడు సుధీర్. పిస్టల్‌ని హీరో మీదికి గురిపెట్టాడు.

"చెప్పానుగా! నాతో పెట్టుకుంటే నీ ఆటకట్టే!" డైలాగ్ అప్పజెప్పి సుధీర్ వికటంగా నవ్వాడు.

హీరో ఇంద్ర మెల్లిగా కుడిచేతిని కదిలించాడు.

సుధీర్ సేఫ్టీక్యాచ్ రిలీజ్ చేసిన శబ్దం. హీరో కళ్ళల్లో ఆందోళనను ప్రదర్శిస్తూ ఆగాడు.

సుధీర్ చేతిలో పిస్టల్ పేలింది. ఇంద్ర ఛాతీని చేత్తో నొక్కుఉంటూ వెల్లకిలా పడిపోయాడు.

"కట్!" ధరణి కేక పెట్టాడు. "టేక్ వోకే!"

అందరూ రిలాక్సవుతున్నారు. ధరణి సిగరెట్ వెలిగించాడు.

"సార్ షాట్ ఓకే! లేవండి!" కో డైరెక్టర్ కోదండం ఇంకా వెల్లకిలా పడుకునే వున్న హీరో ఇంద్ర దగ్గరగా వెళ్ళి, వినయంగా అన్నాడు. ఇంద్రలో చలనం లేదు. అతని చేతి క్రింద నుండీ రక్తం కారుతోంది.

"సార్!" కోదండం అయోమయంగా చూస్తూ అరిచాడు.

ధరణి కో డైరెక్టర్ వైపు తిరిగాడు. కోదండం ఆదుర్దాగా చూస్తున్నాడు. ధరణి పడుకున్న హీరోని సమీపించాడు. "హలో! హీరోగారూ టేక్ వోకే! లేవండి!"

కదలిక లేకుండా వున్న ఇంద్ర కళ్ళలోకి, వెడల్పుగా విచ్చుకున్న కళ్ళల్లోకి చూస్తూ నేల మీద కూచున్నాడు ధరణి. ఇంద్ర కళ్ళలో ఏదేనా లోపించిందా? ధరణి అప్రయత్నంగా ఇంద్ర కళ్ళముందు వేళ్ళను ఆడించాడు. ఇంద్ర రెప్పలు మూసుకోలేదు! ధరణి చూపుడు వేలు ఇంద్ర ముక్కు క్రింద వుంచాడు. కంగారుగా చూస్తూ, అతని నాడిని పట్టుకు చూశాడు. హీరో ఇంద్ర నాడికొట్టుకోవడం లేదు! ఛాతీ మీదే తాపడం అయిపోయిన ఇంద్ర చేతివేళ్ళ సందుల్లోంచీ వెచ్చగా స్రవిస్తున్న రక్తం, అతని మరణ వార్తను ఎర్రగా, కాలువలుగా రాస్తోంది...

***

ఇన్‌స్పెక్టర్ కేతన్ నిర్జీవంగా పడున్న ప్రముఖ హీరో ఇంద్రను తదేకంగా చూసి, తన చూపుల్ని చుట్టూవున్న యూనిట్ సభ్యులవైపు తిప్పాడు. అందరి మొహాల్లోనూ భయం, బాధా నాట్యం చేస్తున్నాయి. దర్శకుడు ధరణి తల వాలిపోయి వుంది. నిర్మాత విజయ సారధి మొహంలో కష్టనష్టాలూ, విచారం రకరకాల రంగుల్లో కనిపిస్తున్నాయి. హీరోయిన్ తూలిక నేలమీద కూలబడిన తల్లివాడిలో తల పెట్టుకుని, దయనీయంగా చూస్తోంది. విలన్ సుధీర్ మొహంలో నెత్తురు చుక్కలేదు. అతని కళ్ళల్లో విపరీతమైన భయం ప్రత్యక్షమవుతోంది.

"అందరికీ అర్థమయ్యే వుంటుంది... హీరో ఇంద్ర గారు పిస్టల్ షాట్ మూలంగా చనిపోయారు.." ఇన్‌స్పెక్టర్ కేతన్ అందర్నీ కలియజూస్తూ అన్నాడు. "మిస్టర్ ధరణీ! షూటింగ్ సమయంలో పిస్టల్స్‌లో రియల్ బులెట్స్ ఉపయోగిస్తారా!"

"నెవర్!" డైరెక్టర్ ధరణి ఆవేశంగా అన్నాడు. "డమ్మీ బులెట్సే వాడుతాం!"

"అయితే ఆ పిస్టల్‌లోకి రియల్ బులెట్ ఎవరు పెట్టారు?" ఇన్‌స్పెక్టర్ కేతన్ ప్రశ్నించాడు; సమాధానం లభిస్తుందన్న ఆశ లేకపోయినా!

"దయచేసి ఎవ్వరూ బైటికి వెళ్ళకండి! దేన్నీ ముట్టుకోకండి! ఎక్కడివాళ్ళక్కడే గప్ చుప్!" ఇన్‌స్పెక్టర్ కేతన్ అన్నాడు. "తిరుపతి నుండి ఎస్పీగారూ, పోలీసులు, వేలి ముద్రల నిపుణుడు, డాక్టరు వస్తున్నారు... ఈలోగా నేను కొన్ని వివరాలు సేకరించాలి. ఒక్కొక్కరే ఆ గదిలోకి రండి! ముందుగా ప్రొడ్యూసర్ గారూ, తరవాత డైరెక్టర్ గారూ..."

కో డైరెక్టర్ అందించిన యూనిట్ సభ్యుల పేర్లున్న కాగితం అందుకుని, కేతన్ గదిలో కెళ్ళాడు. ఆరిపోయిన పైపుని పళ్ళమధ్య బిగించి, ప్రొడ్యూసర్ విజయసారధి గదివైపు కదిలాడు.

***

ఇంతమందిలో హంతకుడెవరో తేల్చాలి! పనిష్మెంట్ రూపంలో తలకోన స్టేషన్‌కి తనను విసిరిపారేసిన డిపార్టుమెంటు ముందు తన సత్తా నిరూపించుకోవాలి! హతుడు, హంతకుడూ – ఇద్దరూ ఇక్కడే, చంద్రమందిర్‌లోనే వున్నారు. ఇద్దరూ ఒకేసారి బైటికి కదలాలి!

ఇన్‌స్పెక్టర్ కేతన్ ఆవేశంగా ఆలోచిస్తూ – యూనిట్ సభ్యుల్ని ప్రశ్నించి తను తయారు చేసుకున్న నోట్స్ ఒకసారి పరిశీలించాడు.

నకిలీ బుల్లెట్ స్థానంలో – పిస్టల్‌లో రియల్ బుల్లెట్ వుంది...

సుధీర్ చేతిలో పేలేదాకా, పిస్టల్ ప్రాపర్టీస్ చూసుకునే ఆర్ట్ డైరెక్టర్ కనకాచలం స్వాధీనంలో వుంది.

కనకాచలం, సుధీర్ ఇద్దరూ పిస్టల్‌ని హాండిల్ చేశారు. ప్రాపర్టీస్ స్టోర్ చేసిన గదిలోనే బుల్లెట్ మార్పిడి జరిగి వుండాలి. ఉదయమే షూటింగ్ ప్రారంభమైంది కాబట్టి, రాత్రి వేళే బుల్లెట్ మార్పిడి జరిగింది...

మార్చే అవకాశం ఎవరెవరికి వుంది! ఆ గదిలోకి ఎవరెవరు వెళ్ళారు?

ఆర్ట్ డైరెక్టర్ కనకాంబరం; ఆర్ట్ డైరెక్టర్ అసిస్టెంట్ రాము వెళ్ళారు. ఇంకా స్టంట్ మాస్టర్ జగన్, కెమెరామన్ కిరణ్, విలన్ సుధీర్ వెళ్ళారు. వెళ్ళినట్టు అందరూ తన ముందు వొప్పుకున్నారు!

ఇన్‌స్పెక్టర్ కేతన్ కళ్ళు కాగితం వెంట పరుగెడుతు

న్నాయి. పిస్టల్‌లో డమ్మీని తీసేసి, రియల్ బుల్లెట్ పెట్టే అవకాశం ఈ అందరికీ వుంది. అవసరం ఎందరికి వుంది? ఎవరికి వుంది?

కెమెరా కిరణ్, స్టంట్ జగన్ నిన్నటి ఉదయం హీరో చేత తన్నులు తిన్నారు. విలన్ పాత్రధారి సుధీర్‌కి ఇంద్ర అంటే పడదు! ఈ వివరాలు హీరోయిన్ తూలిక సప్లై చేసింది!

హీరో ఇంద్ర మీద కసీ,పగా తమలో వున్నాయనీ, హత్య చేసేంత ద్వేషమూ, ధైర్యమూ, అవసరమూ లేవనీ ఆ ముగ్గురు చెప్తున్నారు... ఎవరేం చెప్పినప్పటికీ, ప్రాపర్టీస్ వున్న గదిలోకి వెళ్ళిన వాళ్ళందరూ, పిస్టల్ పేల్చిన సుధీర్‌తో బాటు అనుమానితులే! మొదటి సస్పెక్ట్: సుధీర్!

యువ ఇన్‌స్పెక్టర్ కేతన్ బుర్ర ఆలోచనతో వేడెక్కిపోతోంది....

అందర్నీ విచారిస్తూ రాసుకున్న కాగితాల్ని జేబులో పెట్టుకుని, పైకిలేచి గదిలోంచీ బైటికి నడిచాడు. వంద పైగా కళ్ళు అతన్ని ఆత్రంగా చూశాయి. కేతన్ ఆర్ట్ డైరెక్టర్ కనకాచలం దగ్గర ఆగాడు. "కనకాచలం గారూ... ఒకసారి ప్రాపర్టీసుంచిన స్టోర్ రూం తెరవండి!"

కనకాచలం వినయంగా నడిచాడు... ఇద్దరూ గది ముందు ఆగారు. కనకాచలం తాళం వేసి, తలుపు తెరిచాడు. అతన్ని అక్కడే వుండమని సైగచేసి, ఇన్‌స్పెక్టర్ కేతన్ లోపలి కెళ్ళి, స్విచ్చినొక్కి తలుపు మూశాడు. గదిలో ఏదో వాసన... వేడిగా... వ్యాపిస్తోంది... గోడవారగా పందికొక్కు పరుగెట్టింది. కేతన్ గదిలోని వస్తువుల్ని చూస్తూ మధ్యలో స్తంభంలా నిలబడిపోయాడు.

కేతన్ స్టోర్ రూంలోంచి ఇవతలకి వచ్చాడు, ఆలోచిస్తూ, పొడవాటి కారిడార్ చివరికి నడిచాడు. ఇందాక గదిలో తాను పీల్చిన వాసనని చల్లటిగాలి తరిమేస్తోంది. కేతన్ వెనక్కి తిరిగాడు. పొట్టిగా బొద్దుగా వున్న యువకుడు తనవైపు వస్తున్నాడు. అతన్ని తాను విచారించలేదు. పేరు రాయడం మరిచిపోయాడా, కో డైరెక్టర్?

"నీ పేరు?" దగ్గరగా బెదురుతూ వస్తున్న కుర్రాణ్ణి ప్రశ్నించాడు కేతన్.

"రాజు, సార్!"

"డ్యూటీ!"

"కేటరింగ్‌లో పని సార్... అక్కడ పని లేనప్పుడు.. వరండాలో కాపలా..."

రాజు అంత బొద్దుగా ఎందుకున్నాడో అర్థమైపోయింది కేతన్‌కి.

"కాపలా..." కేతన్ సాలోచనగా అన్నాడు " నిన్న రాత్రి, సాయంత్రం నుండీ స్టోర్ రూం లోకి ఎవరేనా వెళ్ళారా?"

"వెళ్ళారు సార్! ఆర్టు డైరెక్టర్ కనకాచలం గారెళ్ళారు.." రాజు ఐదుగురి పేర్లు చెప్పాడు. చివరగా ఆరో పేరు చెప్పాడు. ఆరోవ్యక్తి పేరు వినగానే కేతన్ ఆశ్చర్యంతో నోరు తెరిచాడు... కేతన్ మరో మూడు నిమిషాల పాటు రాజుతో మాట్లాడుతూ వుండిపోయాడు.

కేతన్, రాజును వెళ్ళమని, కారిడార్‌లో అడుగులు వేయసాగాడు. అతనికి రెండు వైపులా గదులు న్నాయి. తలుపుల మీద యూనిట్ ప్రముఖుల పేర్లున్న స్టిక్కర్లు అతికించి వున్నాయి.

***

"హంతకుడు ఎవరో తెలిసిపోయింది, సార్..." తన ముందువెళ్తున్న ఎస్పీ వీపును చూస్తూ తగ్గు స్వరంతో అన్నాడు ఇన్‌స్పెక్టర్ కేతన్.

హీరో ఇంద్ర శవాన్ని చూసి, గదిలోకి వెళ్తున్న ఎస్పీ, గిరుక్కున వెనక్కి తిరిగి, కేతన్‌ని ఎగాదిగా చూశాడు. "వాట్ డిడ్ యూసే!"

"అదే సార్...హంతకుణ్ణి కనిపెట్టేశాను.."

"ఈజిట్?" ఎస్పీ కంఠంలో ఆశ్చర్యం. "ఎవరు?"

"అందర్నీ హాల్లో సమావేశం కమ్మనండి సార్.... అందరి ముందూ మాస్కుతీసి, హంతకుణ్ని ప్రెజెంట్ చేస్తాను!" కేతన్ ఉత్సాహంగా అన్నాడు.

"తేడా రాదు కదా?" సిగరెట్ పొగ ఊది, అడిగాడు ఎస్పీ.

"వస్తే మళ్ళీ పనిష్మెంట్ ట్రాన్స్‌ఫర్ ఇవ్వండి సార్!" కేతన్ ధీమాగా అన్నాడు.

***

ఇన్‌స్పెక్టర్ కేతన్ అందర్నీచూస్తూ చెప్పసాగేడు: "అందర్నీ విచారించాక నా దృష్టిలో అనుమానితులుగా అయిదుగురు మిగిలారు. సుధీర్; స్టంట్ జగన్; కెమెరా కిరణ్. ఆర్ట్ డైరెక్టర్ కనకాచలం, అతని అసిస్టెంట్ రాము. వీళ్ళందరూ స్టోర్ రూంలోకి వెళ్ళినట్టు ఒప్పుకున్నారు. మొదటి ముగ్గురూ తమకు ఇంద్ర మీద పగ వుందనీ ఒప్పుకున్నారు. చంపేంత పగలేదంటూ వాపోయారు.

"అయితే-మరొకవ్యక్తి స్టోర్ రూంలోకి వెళ్ళాడు. వెళ్ళలేదంటూ నాతో అబద్ధమాడాడు. తన మీద అనుమానం రాకుండా వుండేందుకు అబద్ధం చెప్పాడు.."

"ఆ వ్యక్తి ఎవడో చెప్పు, ఇన్‌స్పెక్టర్! నా భారీ బడ్జెట్ చిత్రాన్ని సర్వనాశనం చేసిన ఆ రాక్షసుణ్ని ఈ చేతుల్తో చంపేస్తాను!" ప్రొడ్యూసర్ విజయసారథి ఆవేశంగా అన్నాడు.

"ఆ వ్యక్తి... ప్రొడ్యూసర్ విజయసారథి!" కేతన్ గంభీరంగా అన్నాడు. హాలులో ఉన్నట్టుండి వ్యాపించిన నిశ్శబ్దం అందరి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తోంది.

"పిచ్చిపట్టిందా? ఎస్పీగారూ, ఈ కుర్రకుంకని తన్ని తగిలేయండి! నా హీరోని నేనెందుకు చంపుకుంటాను?" విజయసారథి అరిచాడు.

"ఎందుకో నువ్వే చెప్పాలి!" కేతన్ నవ్వుతో అన్నాడు. నిన్న సాయంత్రం యూనిట్ అంతా ఫారెస్టులో షూటింగ్‌లో వున్నప్పుడు విజయసారథి స్టోర్ రూంలో కెళ్ళాడు. ఎందుకు? బుల్లెట్ మార్చడానికి! అతని దగ్గర రియల్ బుల్లెట్ ఎక్కడివి? ఒక్కటి కాదు; బాక్సు నిండా వున్నాయి. కొత్తగా కొని తెచ్చిన బాక్సులో ఒకే ఒక బుల్లెట్ లేదు! అది ఇంద్ర శరీరంలో వుంటుంది! విజయసారథి గదిని సోదా చేశాను. అతని షేవింగ్ కిట్‌లో బుల్లెట్ బాక్సుంది!"

"ఉంటే వుంటుంది!" విజయసారథి గర్జించాడు. "అందులోంచీ నేనే కాదు, నువ్వు కూడా బులెట్ కాజేసి, పిస్టల్‌లో లోడ్‌చేసి వుండొచ్చు!"

"యస్! ఒప్పుకుంటాను! బుల్లెట్‌ని ఎవరు తీసి వుంటే, ఆ వ్యక్తి వేలిముద్రలు బులెట్ బాక్స్ మీద వుంటాయి! నేను తీసి వుంటే, నావి! నువ్వు తీసి వుంటే, నీవి!" కేతన్ విజయసారథి కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"నన్ను అనుమానిస్తావా? నీ అంతు చూస్తాను!" విజయసారథి హూంకరించాడు.

కేతన్ ఎస్పీ వైపు తిరిగాడు. "సార్... విజయసారథి స్టోర్ రూంలోకి వెళ్ళాడు. అందుకు సాక్ష్యం ఆ గదిలో కుప్పగాపడి వున్న అతడి పైప్ బూడిద! పిస్టల్ మీద సుధీర్ వేలి ముద్రలు మాత్రమే వున్నాయన్నారు మన ఎక్స్‌పర్ట్. నిజానికి పిస్టల్ మీద ఆర్ట్ డైరెక్టర్ వేలి ముద్రలూ, అతని అసిస్టెంట్ వేలిముద్రలు వుండాలి! అయితే లేవు! విజయసారథి రియల్ బుల్లెట్ లోడ్ చేశాక, పిస్టోల్ని శుభ్రంగా తుడిచేశాడు! అయితే తాను దాచుకున్న బుల్లెట్ బాక్సు మీద వేలిముద్రల్ని చెరిపివేయలేదు! కొత్త బాక్సుమీద వున్న వేలి ముద్రల్లో అతనివి మాత్రమే! కావాలంటే పరీక్షించండి!"

విజయసారథి నిప్పులు కక్కుతూ చూస్తూ కుర్చీలో కూచున్నాడు.

"ఓకే... కేతన్! విజయసారథి తన హీరోని, టాప్ హీరోని ఎందుకు హత్య చేశాడు?" ఎస్పీ అడిగాడు.

"అరెస్టు చేసి, ఇంటరాగేట్ చేయండి! అతనే చెప్తాడు!" కేతన్ గంభీరంగా అన్నాడు.

"అవసరం లేదు! నేనే చెప్తాను! బుల్లెట్ నేనే మార్చాను!" విజయసారథి కంఠం బొంగురుగా ధ్వనించింది. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"నా కొడుక్కి చేసుకోవాలనుకున్న నా చెల్లి కూతురు రాధికను – నమ్మించి మోసం చేశాడు ఇంద్ర. రాధిక మలేషియాలో ఆత్మహత్య చేసుకుంది. ఇంద్రను చంపాలని ఆనాడే నిర్ణయించుకున్నాను. కౌబాయ్ సినిమా నిర్మాణం కేవలం అందుకే ప్లాన్ చేశాము. వాణ్ని ప్రారంభంలోనే తుదముట్టించే ప్లాన్‌తో, డైరెక్టర్ ఎంతవద్దన్నా వినకుండా, ముందుగా క్లైమాక్స్ దృశ్యాల్నే షూట్ చేయమన్నాను! కథలో గన్ ఫైట్ పెట్టించాను!

"నిన్న ఇంద్ర జగన్‌నీ, కెమెరా కిరణ్‌నీ అనుమానించాడు. వాళ్ళలో పగ రగిలింది! ఆ వేడిలో వాణ్ని అంతంచేస్తే అనుమానం నా మీదకు రాదనుకున్నాను! ఇంద్రకూ, విలన్ సుధీర్‌కు పడదని నాకు తెలుసు. ఇంద్ర వద్దన్నా, సుధీర్‌ను బుక్ చేశాను! అనుకున్నట్టే సుధీర్ చేత్తో, ఆ రాక్షసుణ్ణి చంపి పారేశాను! నన్ను అరెస్టు చేసుకోండి!"

విజయసారథి ముగించి, మొహాన్ని తడిపివేస్తున్న చెమటని రెండు చేతుల్తో తుడుచుకున్నాడు.

"కేతన్! అరెస్ట్ హిమ్!" ఎస్పీ ఆజ్ఞాపించాడు.

ఇన్‌స్పెక్టర్ కేతన్ విజయసారథి చేతులకు బేడీలు వేశాడు.

విజయసారథి గొల్లున నవ్వాడు. "బేడీలు వెయ్! లోపల తోయ్! కేసు బుక్ చెయ్! జైలు శిక్ష వెయ్! అయినా ఫర్వాలేదు, ఇన్‌స్పెక్టర్! ఆగస్టు పదిహేనుందిగా. విడుదల బిచ్చం పెట్టడానికి గవర్నమెంటుదిగా!"

"కంగ్రాట్స్, కేతన్! యూ ఆర్ రియల్ బుల్లెట్!" ఎస్పీ మెప్పుగా అన్నాడు.

"కానీ మన హంతకుడు రియల్ బులెట్ లోడ్ చేసి, 'డమ్మీ బులెట్ ఐపోయాడు సార్!" కేతన్ నవ్వాడు.

✱